# సాక్షి నిర్మల్

శుక్రవారం । 25 । ఏప్రిల్ । 2025

## ముష్కరులపై కన్నెర్ర

కశ్మీర్‌లోని పహల్గామ్‌లో పర్యాటకులపై కాల్పులు జరిపి 26 మందిని పొట్టన పెట్టుకున్న ముష్కరుల పై జిల్లా ప్రజలు కన్నెర్రజేశారు. జిల్లా వ్యాప్తంగా గురువారం నిరసనలు చేపట్టారు. మృతులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అర్జుమంద్ అలీ ఆధ్వర్యంలో గాంధీ పార్క్ నుంచి మినీ ట్యాంక్ బండ్ వరకు ర్యాలీ తీశారు. – నిర్మల్‌చైన్‌గేట్



నిరసన తెలుపుతున్న గ్రంథాలయ చైర్మన్ అర్జుమంద్ అలీ కాంగ్రెస్ నాయకులు

## న్యూస్‌రీల్

### జిల్లా జడ్జిని కలిసిన ఎస్పీ


జడ్జికి పూల మొక్క అందిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్: జిల్లా నూతన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టిన ఎస్.శ్రీవాణిని ఎస్పీ జానకీ షర్మిల గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి కార్యాలయంలో కలిసి , పూల మొక్క అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎస్పీ వెంట అదనపు ఎస్పీలు ఉపేంద్రారెడ్డి, అవినాష్‌కుమార్, రాజేశ్‌మీనా, పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రవీణ్‌కుమార్, నిర్మల్ రూరల్ ఇన్‌స్పెక్టర్ కృష్ణ ఉన్నారు.

### నేడు అడెల్లి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

సారంగాపూర్: ప్రసిద్ధ అడెల్లి మహాపోచమ్మ ఆలయ ధర్మకర్తల మండలి ప్రామాణ స్వీకారం గురువారం ఉదయం 11 గంటలకు ఆలయ ప్రాంగణంలో నిర్వహించనున్నట్లు ఈవో రమేశ్ తెలిపారు. మొత్తం 14 మంది ధర్మకర్తలకు గాను 11మంది జాబితాతో దేవాదాయ శాఖ నుంచి ఉత్తర్వులు వెలువడ్డాయని పేర్కొన్నారు. మరో ముగ్గురు ధర్మకర్తలను త్వరలోనే ఎంపిక చేస్తారని తెలిపారు. అయితే ఆలయ ధర్మకర్తలుగా రొడ్డ మారుతీ, సింగం భోజాగౌడ్, దర్శనం లస్మన్న, కటికంటి లక్ష్మణ్, బ్యాగరి చిన్న సాయన్న, బట్టు భోజన్న, మగ్గిడి రత్నాకర్, జగత్ ప్రసాద్, వెంకటరమణారెడ్డి, నర్సారెడ్డి, ప్రభాకర్‌గౌడ్‌తోపాటు ఎక్స్ అఫీషియో సభ్యుడిగా ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసశర్మలు గురువారం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు పేర్కొన్నారు.

### అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు


నిర్మల్‌చైన్‌గేట్:పాఠశాలలకు ఇచ్చిన విధంగా అంగన్‌వాడీ కేంద్రాలకు మే నెల మొత్తం సెలవులు ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేశ్ అన్నారు. హక్కుల సాధన కోసం అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా చేశారు. అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను బలహీన పరిచేందుకే కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పథకం తీసుకువచ్చిందన్నారు. జీవో 14ను వెంటనే రద్దు చేయాలన్నారు. 50 సంవత్సరాలుగా అంగన్‌వాడీ కేంద్రాలు కృషి ఫలితంగా 15 రకాల జబ్బులు నివారించడంలో ప్రముఖ పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాలు బలహీనపరచడం వలన బలహీనవర్గాల ప్రజలకు అన్యాయం జరుగుతుందన్నారు. కేంద్రాల్లో ఇప్పటికే పూర్వ ప్రాథమిక విద్య కొనసాగిస్తున్నారని దీనిని సమర్థవంతంగా నిర్వహించడానికి మెరుగైన వసతులు కల్పించాలన్నారు. నూతన విద్యా విధానం పేరుతో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వినాశకర విధానాలు ఐసీడీఎస్‌ను ప్రజలకు దూరం చేస్తున్నాయన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో ఒకే యాప్‌ను అమలు చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న మినీ కేంద్రాల టీచర్ల వేతనాలు విడుదల చేయాలని కోరారు. కేంద్రాలకు పక్కా భవనాలు, మరుగుదొడ్లు నిర్మించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సీఐటీయూ) జిల్లా ఉపాధ్యక్షులు దేవిక, లావణ్య, రేష్మ, జిల్లా సహాయ కార్యదర్శిలు రమ్య, భాగ్య, జిల్లా నాయకులు పుష్పలత కవిత, మీనాక్షి, నర్సమ్మ పాల్గొన్నారు.

### నాడు నీళ్లు.. నేడు రాళ్లు..!



జిల్లాలో రోజురోజుకు ఎండలు ముదిరిపోతున్నాయి. చెరువులు, కుంటలు, వాగులు ఎండిపోతున్నాయి. కుంటాల మండలంలోని వెంకూరు వాగు నెల క్రితం వరకు నీటితో కళకళలాడింది. ఎండల కారణంగా ఇప్పుడు చుక్క నీరు లేక.. ఇలా రాళ్లు రప్పలతో కనిపిస్తోంది. మూగజీవాలు తాగునీటికి తండ్లాడుతున్నాయి. – కుంటాల

## ఎండ ప్రచండ



జిల్లాలో గురువారం నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు..



- జిల్లాలో 45 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- అల్లాడుతున్న జనం
- వడదెబ్బతో పలువురు మృతి
- అధిక ఎండలతో 'ఎర్ర'బడ్డ జిల్లా
- జాగ్రత్తగా ఉండాలంటున్న వైద్యులు

నిర్మల్:పొద్దున ఎనిమిదింటికే జిల్లాలో భానుడు భగ్గుమంటున్నాడు. పగలు అడుగు బయట పెట్టలేని పరిస్థితి ఉంది. సాయంత్రం ఏడైనా వేడి తగ్గడం లేదు. వడదెబ్బకు ఇప్పటికే పలువురు ప్రాణాలనూ కోల్పోయారు. జిల్లాలో ఎండలు ప్రచండంగా మారాయి. ఏప్రిల్‌లోనే 45 డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతలతో జిల్లా 'ఎర్ర'బడింది. ఇప్పుడే నిప్పుల కొలిమిలా మండుతుంటే.. ఇక వచ్చేనెల మరింత కష్టమే' అని జిల్లా వాసులు ఆందోళన చెందుతున్నారు.

**అత్యధిక ఉష్ణోగ్రతలు..**

జిల్లాలో సహజంగా మే నెలలో 42–43 డిగ్రీ సెల్సియస్‌లో ఉష్ణోగ్రతలు నమోదవుతుంటాయి. అధికంగా అంటే 44–45 డిగ్రీ సెల్సియస్ వరకూ వెళ్తాయి. కానీ ఈసారి ఏప్రిల్‌లోనే 45 డిగ్రీ సెల్సియస్ నమోదవుతోంది. వారం పది రోజులుగా 44–45డిగ్రీలకు ఏమాత్రం తగ్గకుండా సూర్యప్రతాపం కొనసాగుతోంది. మిట్టమధ్యాహ్నం 45 డిగ్రీ సెల్సియస్ దాటుతోంది. గురువారం జిల్లాలో అత్యధికంగా తానూర్ మండలకేంద్రంలో గరిష్ఠంగా 45.4 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, ముధోల్‌లో 45.2, కడెం మండలం లింగాపూర్‌లో 45.1 ఉష్ణోగ్రత నమోదైంది. చాలాచోట్ల 44 డిగ్రీలపైనే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. దీంతో రోడ్లన్నీ ఖాళీగా మారుతున్నాయి. తప్పనిసరి పరిస్థితుల్లో పగటిపూట బయటకు వెళ్లి, ఎండలో తిరిగిన వాళ్లు అస్వస్థతకు లోనవుతున్నారు. ఇటీవల జిల్లాకేంద్రంలో ఒకేరోజు ఇద్దరు వడదెబ్బతో మృతిచెందారు. ఎండతోపాటు మధ్యాహ్నం పూట వేడిగాలి మరింత ఇబ్బంది పెడుతోంది. ఇంటిపట్టున ఉంటున్నప్పటికీ వృద్ధులు, పిల్లలు వేడికి ఇబ్బంది పడుతున్నారు. నాలుగు రోజుల వ్యవధిలో నలుగురు వడదెబ్బకు బలయ్యారు.

**వడ.. దడ**

జిల్లా ఆస్పత్రితోపాటు ప్రైవేటు ఆస్పత్రుల్లో ప్రస్తుతం చికిత్స కోసం వస్తున్నవారిలో అధికశాతం ఎండతో అస్వస్థతకు లోనైనవారే ఉంటున్నారు. వడదెబ్బ తగలడంతో పరిస్థితి సీరియస్‌గా మారినవారూ ఉంటున్నారు. ఈనెల 21న జిల్లా కేంద్రంలోని కురన్నపేటకు చెందిన నిగులపు శంకర్, రాజు ఇద్దరూ వడదెబ్బతో మృత్యువాత పడ్డారు. జిల్లాకేంద్రానికే చెందిన సోఫీబేగ్ అనే యువకుడు సైతం వడదెబ్బతో మృతిచెందాడు. వివిధ మండలాల్లోనూ పలువురు ఎండదెబ్బకు అస్వస్థతకు గురై చనిపోయారు.

**'ఎర్ర'బడ్డ జిల్లా...**

ఎప్పుడూ మే నెలలోనే అత్యధిక ఉష్ణోగ్రతల పరంగా రెడ్‌అలర్ట్ ఉండే జిల్లాలో ఇప్పుడు ఏప్రిల్‌లోనే ఈ హెచ్చరిక జారీకావడం గమనార్హం. 44డిగ్రీ సెల్సియస్ ఉష్ణోగ్రతను తట్టుకోవడమే చాలాకష్టం .. అలాంటిది జిల్లాలో వరుసగా 45 డిగ్రీ సెల్సియస్ నమోదుకావడంతో జనం బెంబేలెత్తుతున్నారు. ప్రతిరోజూ ఉష్ణోగ్రతల జాబితాలో నిర్మల్ జిల్లా టాప్‌లో రెడ్ అలర్ట్‌తో ఉంటోంది. ఒకప్పుడు ఆదిలాబాద్, రామగుండంలో ఉండే ఉష్ణోగ్రతలు ఇప్పుడు నిర్మల్‌లో నమోదు కావడం చర్చనీయాంశంగా మారింది. జిల్లాలో గురువారం తానూరు, ముధోల్, కుభీర్, కడెం మండలాల్లో 45డిగ్రీ సెల్సియస్ పైనే ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలుస్తోంది.

### జాగ్రత్తలు తీసుకోవాలి..



జిల్లాలో అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండలో తిరగడం ఏమాత్రం మంచిది కాదు. తప్పనిసరి పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తగు జాగ్రత్తలు తీసుకోవాలి. తలకు ఎండ తగలకుండా, చెవుల్లోకి వేడి గాలి వెళ్లకుండా చూసుకోవాలి. డీహైడ్రేషన్ కాకుండా తరచూ నీళ్లు, పళ్లరసాలు తాగుతూ ఉండాలి. వడదెబ్బకు గురైతే ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యున్ని సంప్రదించాలి.

– డాక్టర్ బి.రవి, ఎండీ, నిర్మల్

## కొనుగోలు కేంద్రం కోసం రోడ్డెక్కిన రైతులు


పొట్టపల్లి వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

లక్ష్మణచాంద:మండలంలోని పొట్టపల్లి గ్రామ రైతులు తమ గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం ఆందోళనకు దిగారు. మండల కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ, గ్రామంలో కోతలు పూర్తి చేసి ధాన్యాన్ని రోడ్డుపై ఆరబెట్టామని, కొందరు రైతుల వరి ధాన్యం ఇప్పటికే ఆరిపోయినప్పటికీ, ప్రభుత్వం గ్రామంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు.

**రెండేళ్లుగా ఇదే సమస్య**

గతంలో పొట్టపల్లి గ్రామంలో ఎఫ్ఎస్‌సీఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేసేవారని రైతులు తెలిపారు. అయితే, రెండేళ్లుగా ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి రాకపోవడంతో ఎఫ్ఎస్‌సీఎస్ కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయడం లేదన్నారు. దీంతో వానాకాలం, యాసంగి పంటలు చేతికి వచ్చిన సమయంలో కొనుగోలు కేంద్రం కోసం రైతులు నిరీక్షించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. పక్క గ్రామాల కొనుగోలు కేంద్రాల వారిని బతిమాలి, సబ్‌సెంటర్ ఏర్పాటు చేయించి ధాన్యాన్ని అమ్ముకుంటున్నామని, గత రెండేళ్లుగా ఈ తంతు కొనసాగుతోందని రైతులు పేర్కొన్నారు. తమ గ్రామానికి పీఏసీఎస్, ఐకేపీ లేదా ఇతర కొనుగోలు కేంద్రం మంజూరు చేసి రైతుల ఇబ్బందులను తొలగించాలని కోరారు.

**తహసీల్దార్ హామీతో ఆందోళన విరమణ**

తహసీల్దార్ కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై హామీ ఇచ్చే వరకు ఆందోళన విరమించేది లేదని రైతులు పట్టుబట్టారు. దీంతో మండల కేంద్రం నుంచి నిర్మల్‌కు, నిర్మల్ నుంచి మండల కేంద్రానికి వెళ్లే వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్సై మాలిక్ రెహమాన్ సంఘటనా స్థలానికి చేరుకొని రైతులతో చర్చించారు. రైతులు హామీ కోరడంతో ఎస్సై తహసీల్దార్ జానకితో ఫోన్‌లో మాట్లాడారు. రైతులతో సంభాషించేలా చేశారు. కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ జానకి హామీ ఇవ్వడంతో రైతులు ఆందోళన విరమించారు.

## ధరణి సమస్యలు భూభారతితో పరిష్కారం


లోకేశ్వరం రైతు వేదికలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్, వేదికపై అదనపు కలెక్టర్, ఆర్డీవో

- కలెక్టర్ అభిలాష అభినవ్
- లోకేశ్వరం, నర్సాపూర్(జి) మండలాల్లో అవగాహన సదస్సులు


ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న కలెక్టర్

లోకేశ్వరం/నర్సాపూర్(జి): భూ భారతి చట్టంతో ధరణిలో పెండింగ్‌లో ఉన్న భూ సమస్యలు పరిష్కా రం అవుతాయని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. లోకేశ్వరం, నర్సాపూర్(జి) మండల కేంద్రాల్లోని రైతు వేదికలో భూభారతి చట్టంపై గురువారం వేర్వేరుగా అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ రైతులకు వారి భూములపై సమగ్ర హక్కులు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం భూభారతి (నూతన ఆర్ఓఆర్)2025 చట్టాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిందని తెలిపారు. గ్రామ పాలన అధికారుల నియామకంతో భూ సమస్యలకు సత్వర పరిష్కారం లభిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో సాదాబైనామాల ద్వారా కొనుగోలు చేసిన వ్యవసాయ భూములపై పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ప్రభుత్వం క్రమబద్ధీకరించేందుకు భూభారతిలో వీలు కల్పించిందని పేర్కొన్నారు. ప్రతీ గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి వార్షికంగా వాటిని ప్రజల ముందు ప్రదర్శిస్తారని, ఆధార్ తరహాలో భూమికి ప్రత్యేక భూదార్ నంబర్ కేటాయించి అక్రమణలకు అడ్డుకట్టవేయడమే ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. వివిధ గ్రామాలకు చెందిన రైతులు వారి భూ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. రైతులు అడిగిన భూ సమస్యలకు కలెక్టర్ సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్, భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ భీంరెడ్డి, భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, తహసీల్దార్లు మోతీరాం, శ్రీనివాస్, ఎంపీడీవోలు వెంకటరమేశ్, పుష్పలత, పీఏసీఎస్ చైర్మన్ రత్నాకర్‌రావు, నర్సాపూర్(జి) మండల ప్రత్యేక అధికారి అంజిప్రసాద్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

**కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలి**

లోకేశ్వరం: వరి ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కేంద్రాన్ని గురువారం పరిశీలించారు. వరి కొనుగోలు కేంద్రం వద్ద రైతులకు ఇబ్బందులు కలగకుండా సౌకర్యాలు కల్పించాలన్నారు. ఎండ తీవ్రత అధికంగా ఉన్నందున రైతులు విశ్రాంతి తీసుకునేందుకు వీలుగా టెంట్ ఏర్పాటు చేయాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నిర్వహించే రికార్డులను, వరి ధాన్యంలో తేమ శాతను పరిశీలించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టరు కిశోర్‌కుమార్, భైంసా ఆర్డీవో కోమల్ రెడ్డి, ఏపీఎం మల్లేశ్ పాల్గొన్నారు.

## జిల్లాలో గొలుసు దొంగలు

- బరితెగిస్తున్న చైన్ స్నాచర్లు
- నడిరోడ్డుపైనే నగలు లాక్కెళ్తున్నారు..
- బయటకు వెళ్లడానికి జంకుతున్న మహిళలు
- పోలీసులకు సవాల్



నిర్మల్‌టౌన్: ఒకవైపు బంగారం ధరలు రూ.లక్షకు చేరువైంది. మరోవైపు ఈజీ మనీ కోసం దొంగలు రెచ్చిపోతున్నారు. భయం బెరుకు లేకుండా బరితెగిస్తున్నారు. జిల్లాలో కొన్ని రోజులుగా జరుగుతున్న చైన్ స్నాచింగ్‌లు మహిళలను ఆందోళనకు గురిచేస్తున్నాయి. దొంగలు పక్కా ప్రణాళికతో మాటువేసి గొలుసులు లాక్కెళ్తున్నారు. పట్టపగలే ఎలాంటి భయం లేకుండా చోరీలకు పాల్పడుతున్నారు. వరుస ఘటనలతో జిల్లాలో గొలుసు దొంగల ముఠా సంచరిస్తోందన్న ప్రచారం జరుగుతోంది. బైక్‌లపై వచ్చే దొంగలు ఒంటరి మహిళలు, వృద్ధులను లక్ష్యంగా చేసుకుని తాళిబొట్లు, గొలుసులు లాక్కుంటున్నారు. పట్టణాల నుంచి గ్రామాలకు తమ రూటు మార్చిన ఈ ముఠాలు, మాయమాటలతో లేదా హఠాత్తుగా దాడి చేసి దోచుకుంటున్నారు.

**పోలీసులకు సవాల్..**

పోలీసుల పెట్రోలింగ్, సీసీ కెమెరాలు, చెక్‌పోస్టులు ఉన్నప్పటికీ దొంగలు ఆనవాళ్లు లేకుండా తప్పించుకుంటున్నారు. మహారాష్ట్ర సరిహద్దు, జాతీయ రహదారులు దొంగలకు పారిపోయేందుకు సౌలభ్యంగా మారాయి. ప్రజలు భద్రతా చర్యలు పెంచాలని, ముఖ్యంగా ఒంటరిగా బంగారం ధరించి బయటకు వెళ్లడం మానుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. రాత్రివేళల్లో అపరిచితులతో మాట్లాడకుండా, తోడుగా వెళ్లడం, ఇంటి లోపల మాట్లాడటం వంటి జాగ్రత్తలు తీసుకోవాలని సలహా ఇస్తున్నారు. పోలీసులు గస్తీని మరింత ఉధృతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

**పక్క రాష్ట్రం నుంచి....**

జిల్లా సరిహద్దులో మహారాష్ట్ర ఉండడంతో నిత్యం రాకపోకలు కొనసాగుతుంటాయి. అంతేకాకుండా జిల్లాలో 44, 61 నంబర్ జాతీయ రహదారులు ఉండడంతో ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి వచ్చిన వ్యక్తులు నేరుగా దొంగతనాలు చేసి పారిపోతున్నారని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

**ఈ జాగ్రత్తలు తప్పనిసరి..**

- మహిళలు ఒంటరిగా వెళ్తున్నప్పుడు మెడలో బంగారం ధరించడం చాలా ప్రమాదకరం.
- వీలైనంతవరకు బయటకు వెళ్లేటప్పుడు ఎవరినైనా తోడుగా తీసుకెళ్లాలి.
- అపరిచితులు పలకరిస్తే మాట్లాడవద్దు. వారు మాటల్లో దింపి చోరీ చేసే అవకాశం ఉంది.
- ఇళ్ల వద్దకు అపరిచిత వ్యక్తులు వస్తే లోపల ఉండి మాట్లాడడం మంచిది.

### జాగ్రత్తగా ఉండాలి..

జిల్లాలో చైన్‌స్నాచింగ్ ఘటనలపై దృష్టిపెట్టాం . గతంలో కొన్నిముఠాలు మాత్రమే ఉండేవి. ఇటీవల కొత్త దొంగలు వచ్చినట్లు తెలుస్తోంది. ప్రజలు కూడా అపరిచితులతో జాగ్రత్తగా ఉండాలి. అనుమానాస్పద వ్యక్తులు ఉంటే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలి.

– జానకీషర్మిల, ఎస్పీ

**ఇటీవలి ఘటనలు..**

- ఈ ఏడాది జనవరి 15న జిల్లా కేంద్రంలోని బుధవార్‌పేట్ కాలనీకి చెందిన నళిని తన కూతురితో కలిసి కాలనీలో నడుచుకుంటూ వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు వ్యక్తులు రూ.1.50 లక్షల విలువైన బంగారు గొలుసులు లాక్కెళ్లారు.
- ఈనెల 13న జిల్లా కేంద్రంలోని పాత నటరాజ్ మిల్ సమీపంలో ముగ్గురు యువకులు మహిళ మెడలో నుంచి చైన్ లాక్కెళ్లేందుకు ప్రయత్నించారు. అప్రమత్తమైన మహిళలు కేకలు వేయడంతో స్థానికులు బైక్‌పై వచ్చిన ముగ్గురిని వెంబడించి పట్టుకొని పోలీసులకు అప్పగించారు.
- ఇటీవలే తానూర్ మండలం బొంద్రట్ గ్రామంలో నడుచుకుంటూ.. వెళ్తున్న ఓ మహిళ మెడలోని పుస్తెలతాడును గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి లాక్కెళ్లాడు.
- ఈనెల 19న సారంగాపూర్ మండలం జామ్ గ్రామానికి ఇద్దరు మహిళలు ఆటోలో నిర్మల్ నుంచి బయలుదేరారు. వెనుక నుంచి ద్విచక్ర వాహనంపై ఆటోను అనుసరిస్తూ.. వచ్చిన ఇద్దరు దొంగలు ధని గ్రామ సమీపంలోని మూల మలుపు వద్దకు చేరుకోగానే ఆటో స్పీడ్ బ్రేకర్ వద్ద వేగం తగ్గించడంతో.. వెనుక వైపు కూర్చున్న సునీత, గంగమణి మెడలోని 26 గ్రాముల బంగారు గొలుసులు లాక్కెళ్లారు.
- ఈనెల 20న లక్ష్మణచాంద మండలం వడ్యాల్ గ్రామానికి చెందిన రామవ్వ తమ బంధువుల వివాహ వేడుకకు ఇంటి పక్కన ఉన్న భీమేష్‌తో కలిసి ద్విచక్ర వాహనంపై నిర్మల్‌కు బయలుదేరింది. మార్గమధ్యలో కనకాపూర్ వద్ద ఇద్దరు వ్యక్తులు తాము పోలీసులమని చెప్పి బైక్‌ను ఆపారు. ముందు హత్య జరిగిందని, అటువైపు వెళ్లొద్దని, మెడలో ఉన్న బంగారు గొలుసు తీసి లోపల పెట్టుకోవాలని సూచించారు. దీంతో ఆ మహిళ మెడలోని నాలుగు తులాల బంగారు గొలుసు తీసి పర్సులో పెట్టుకునే క్రమంలో తాను పెట్టిస్తామని చెప్పి గొలుసు మాయం చేసి ఖాళీ పర్సు ఇచ్చారు. తర్వాత అక్కడి నుంచి వెళ్లిపోయారు. మహిళ పర్సు తీసి చూడగా అందులో రాళ్లు కనిపించాయి.

## పదేళ్ల నిరీక్షణకు తెర

- సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు గ్రీన్ సిగ్నల్
- ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జిల్లాలో 92 మంది ఉద్యోగులు

| ఉద్యోగుల వివరాలు: | |
|---|---|
| మొత్తం ఉద్యోగులు | 92 |
| డీపీఎంలు | 5 |
| ఏపీఎంలు | 21 |
| క్లస్టర్ కోఆర్డినేటర్లు | 56 |
| మాస్టర్ బుక్ కీపర్లు | 10 |

నిర్మల్‌చైన్‌గేట్: గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. దశాబ్దకాలంగా ఎదురుచూస్తున్న సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. ఈ నిర్ణయంతో జిల్లాలో 92 మంది ఉద్యోగులకు బదిలీ అవకాశం ఏర్పడింది. బదిలీల ప్రక్రియ పూర్తయితే, జిల్లావ్యాప్తంగా అన్ని కేడర్లలో కొత్త ఉద్యోగులు చేరనున్నారు.

**దీర్ఘకాల నిరీక్షణ..**

గతేడాది జులైలో జరిగిన సాధారణ బదిలీల సందర్భంగా సెర్ప్ ఉద్యోగులు తమకు అవకాశం కల్పించాలని కోరినప్పటికీ, అప్పట్లో ప్రభుత్వం పట్టించుకోలేదు. సెర్ప్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల బదిలీలు, పదోన్నతులు వర్తింపజేయకపోవడంపై గత కొన్నేళ్లుగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. పదేళ్లుగా ఒకే కేడర్‌లో పనిచేస్తున్న కొందరు ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. 2023 నుంచి సెర్ప్ సిబ్బందికి పే–స్కేల్ విధానం ద్వారా వేతనాలు చెల్లిస్తున్నప్పటికీ, బదిలీలు, పదోన్నతుల విషయంలో ఎలాంటి పురోగతి లేకపోవడంతో ఉద్యోగులు విసిగిపోయారు. యూనియన్ నాయకులు గతంలో సంబంధిత శాఖ మంత్రులతో అనేకసార్లు చర్చలు జరిపినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఎట్టకేలకు, ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగుల బదిలీలకు ఆమోదం తెలపడంతో వారి దీర్ఘకాల నిరీక్షణకు త్వరలో తెరపడనుంది.

**జిల్లాలో 92 మంది ఉద్యోగులకు అవకాశం**

సెర్ప్ సంస్థ గ్రామీణ ప్రాంతాల్లో మహిళల ఆర్థిక ఎదుగుదల, ఉపాధి కల్పనలో కీలక పాత్ర పోషిస్తోంది. 23 ఏళ్లుగా సెర్ప్ ఉద్యోగులు అత్యంత కీలక సేవలు అందిస్తున్నారు. సెర్ప్‌లో మినిస్టీరియల్, ఫీల్డ్ సిబ్బంది, అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్లు, కమ్యూనిటీ కో–ఆర్డినేటర్లు వివిధ హోదాల్లో పనిచేస్తున్నారు. వీరిలో ఎక్కువమంది క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా అన్ని కేడర్లలో మొత్తం 92 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు.

**'వెలుగు' నుంచి సెర్ప్ వరకు**

2000లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మహిళా స్వయం సహాయక సంఘాల కోసం 'వెలుగు' పేరుతో సంస్థను కొన్ని జిల్లాల్లో ప్రారంభించారు. 2002లో ఈ ప్రాజెక్టును రాష్ట్రవ్యాప్తంగా విస్తరించారు. 2004లో కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకాన్ని 'ఇందిరా క్రాంతి పథం' (ఐకేపీ)గా మార్చగా, 2014లో టీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత దీనిని గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్)గా నామకరణం చేసింది. 2002 నుంచి సెర్ప్ ఉద్యోగులు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్నారు. 2023 ఏప్రిల్‌లో బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల హామీ మేరకు వీరి ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని నిర్ణయించింది. అయితే, పే–స్కేల్, ఇతర సౌకర్యాలు వర్తింపజేసినప్పటికీ, బదిలీలు, పదోన్నతుల విషయంలో ఇంకా పూర్తిస్థాయి అమలు జరగాల్సి ఉంది.

### ఏళ్లుగా ఎదురు చూస్తున్నాం..



రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ఉద్యోగుల బదిలీల ప్రక్రియను చేపట్టేందుకు ముందుకురా వడం మంచి పరిణామం. ఉద్యోగులు, సిబ్బంది పదేళ్లుగా బదిలీల కోసం ఎదురుచూస్తున్నారు. ఇతర జిల్లాలకు చెందిన చాలామంది సిబ్బంది పదేళ్లు, అంతకంటే ఎక్కువగానే ఒకేచోట పనిచేస్తున్నారు. ప్రభుత్వం 100 శాతం ఉద్యోగుల బదిలీలకు అవకాశం ఇవ్వనుండటంతో దాదాపు అందరికీ స్థానచలనం కలుగుతుందని భావిస్తున్నాం.

– జాదవ్ రవీందర్, సెర్ప్ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు

## ఓపెన్ పరీక్షల్లో మాస్ కాపీయింగ్..!

- భైంసాలో ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఈవో తనిఖీ

భైంసాటౌన్:ఓపెన్ టెన్త్ పరీక్షల్లో పలువురు విద్యార్థులు మాస్ కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. పరీక్ష కేంద్రాల్లో సీఎస్, డీవోలు ఇందుకు సహకరిస్తున్నట్లు సమాచారం. గురువారం డీఈవో రామారావు పట్టణంలోని ఓపెన్ టెన్త్ పరీక్ష కేంద్రాలను తనిఖీ చేశారు. ముందుగా మదీనాకాలనీలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రాన్ని సందర్శించారు. పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని సీఎస్, డీవోలకు సూచించారు. అనంతరం కిసాన్‌గల్లిలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కాపీయింగ్‌కు పాల్పడుతున్నట్లు ఆయన దృష్టికి వచ్చినట్లు సమాచారం. దీంతో పరీక్ష ప్రారంభ సమయంలో తనిఖీకి వచ్చిన ఆయన సాయంత్రం వరకు భైంసాలోనే పరీక్ష కేంద్రాలను క్షుణ్ణంగా తనిఖీ చేసినట్లు తెలిసింది. కాపీయింగ్‌ను ప్రోత్సహించవద్దని సంబంధిత పరీక్ష కేంద్రాల సీఎస్, డీవోలకు సూచించినట్లు తెలిసింది.

## క్లుప్తంగా

### బాసర అమ్మవారికి వినతి



సరస్వతి అమ్మవారికి వినతిపత్రం ఇస్తున్న మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లు

**బాసర:** బాసర ఆర్‌జీయూకేటీలో పని చేస్తున్న కాంట్రాక్ట్ మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్ల నిరసన గురువారం 16వ రోజుకు చేరుకుంది. తమ సేవలు క్రమబద్ధీకరించాలని కోరుతూ శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి వినతిపత్రం అందించారు. తమ అర్హతలు, సామర్థ్యాలను ప్రభుత్వం గుర్తించడం లేదని, సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పటికైనా స్పందించాలని అమ్మవారిని వేడుకున్నారు. కార్యక్రమంలో మహిళా అసిస్టెంట్ ప్రొఫెసర్లు పెద్దఎత్తున పాల్గొన్నారు.

### లింగాపూర్‌లో దొంగతనం



గదిని పరిశీలిస్తున్న సీఐ అజయ్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి

**కడెం:** మండలంలోని లింగాపూర్ గ్రామంలో బుధవారం రాత్రి దొంగతనం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గుగిల్ల బుచ్చన్న కొడుకు దుబాయ్ వెళ్లగా కోడలు సరిత అత్తమామలతో కలి సి ఉంటుంది. బుధవారం సరిత తల్లిగారింటికి వెళ్లగా బుచ్చన్న గదికి తాళం వేసి పక్క గదిలో నిద్రించాడు. తెల్లవారుజాము చూసేసరికి గది తాళం, బీరువా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ అజయ్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో గదిని పరిశీలించారు. తులం బంగారం, 11 తులాల వెండి ఎత్తుకెళ్లినట్లు, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ, ఎస్సైలు సూచించారు.

### సంపులో దూకి యువకుడు ఆత్మహత్య

**కుభీర్:** మండలంలోని అంతర్ని గ్రామానికి చెందిన సుకలీకర్ సురేశ్(32) అనే యువకుడు గ్రామ సమీపంలోని మిషన్ భగీరథ సంపులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై రవీందర్ తెలిపారు. పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని తురాటి గ్రామానికి చెందిన సురేశ్‌కు అంతర్ని గ్రామానికి చెందిన రోజతో వివాహం జరగ్గా ఇల్లరికం వచ్చాడు. ఈ నెల 22న భార్యాభర్తల మధ్య గొడవ జరగడంతో భార్య రోజ తన అక్క ఇంటికి వెళ్లిపోయింది. భార్య వెళ్లిపోవడంతో జీవితంపై విరక్తి చెంది మద్యం మత్తులో భగీరథ సంపులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం సంపు దగ్గరకు వచ్చిన వాటర్‌మెన్ మృతదేహాన్ని గమనించి గ్రామస్తులకు సమాచారం ఇచ్చాడు. సురేశ్ తల్లి సమన్‌బాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

### వడదెబ్బతో యువకుడు మృతి



సోఫిబేగ్ (ఫైల్)

**నిర్మల్‌టౌన్:** వడదెబ్బతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన గురువారం జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని బ్రహ్మపూరి కాలనీకి చెందిన మహ్మద్ బేగ్ కుమారుడు సోఫిబేగ్ (25) గత రెండు రోజుల క్రితం వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. ఈక్రమంలో గురువారం ఇంట్లో మృతి చెందాడు. కాగా సోఫిబేగ్ మూడు నెలల క్రితం దుబాయ్ నుంచి నిర్మల్‌కు వచ్చాడు.

**మేకల కాపరి..**



లింగురాం (ఫైల్)


**ముధోల్:** మండలంలోని మచ్కల్ గ్రామానికి చెందిన షెల్కే లింగురాం(58) అనే మేకల కాపరి వడదెబ్బతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. లింగురాం మేకలు కాస్తూ జీవనం సాగించేవాడు. రోజు మాదిరిగానే బుధవారం గ్రామ సమీపంలో ఉన్న చెరువు వద్ద పెద్ద కుమారుడు గంగాధర్‌తో కలిసి మేకలను మేపుతున్నాడు. ఈక్రమంలో మిట్ట మధ్యాహ్నం ఒక్కసారిగా లింగురాం కుప్పకూలిపోయాడు. గంగాధర్ చెట్టు నీడకు తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా లింగురాం స్పందించలేదు. వెంటనే గ్రామంలోకి వెళ్లి కుటుంబసభ్యుల కు, గ్రామస్తులకు సమాచారం అందించారు. వారు వచ్చే సరికి లింగురాం మృతి చెంది ఉన్నాడు. లింగురాంకు భార్య లక్ష్మి, కుమారులు గంగాధర్, శ్రావణ్, కుమార్తె పూజ ఉన్నారు.

### బెల్లం, పటిక పట్టివేత

**తాండూర్:** జాతీయ రహదారి మీదుగా అక్రమంగా నాటుసారా తయారీకి వినియోగించే బెల్లం, పటికను తరలిస్తుండగా గురువారం ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. గోలేటికి చెందిన దుర్గం రాజ్‌కుమార్, దాగం సంజు, అజ్మీరా చందు అనే వ్యక్తులు బెల్లం, పటిక తరలిస్తున్నారన్న సమాచారం మేరకు ఐబీ తాండూర్ ఫ్లైఓవర్ బ్రిడ్జి వద్ద ఎక్సైజ్ అధికారులు కారును తనిఖీ చేసి పట్టుకున్నారు.

# ఎల్‌సీకి సాంకేతికత!

- విద్యుత్ ప్రమాదాల నివారణకు యాప్
- ఇక ఆన్‌లైన్‌లో విద్యుత్ లైన్ క్లియరెన్స్
- అందుబాటులోకి తీసుకొచ్చిన ఎన్‌పీడీసీఎల్
- యాప్‌పై అధికారులు, ఉద్యోగులకు శిక్షణ పూర్తి




**మంచిర్యాలరూరల్(హాజీపూర్):** విద్యుత్ వినియోగదారులకు మరింతగా మెరుగైన, నాణ్యమైన సేవలు అందించేందుకు తెలంగాణ ఎన్‌పీడీసీఎల్ ఆధునిక సాంకేతిక పద్ధతులు అవలంభిస్తోంది. ఇందులో భాగంగా విద్యుల్ లైన్ క్లియరెన్స్ (ఎల్‌సీ) సులభంగా ఉండేలా చర్యలు చేపట్టింది. ఫోన్‌కాల్ ద్వారా ఎల్‌సీ తీసుకోవడం వల్ల కొన్ని సందర్భాల్లో విద్యుత్ ప్రమాదాలతో పాటు అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ సమస్యలను అధిగమించేందుకు ఎల్‌సీ (విద్యుత్ సరఫరా నిలిపివేత, పునరుద్ధరణ)తీసుకోవడానికి ఎన్‌పీడీసీఎల్ ప్రత్యేక యాప్ రూపొందించింది. ఇప్పటి వరకు ఎల్‌సీ తీసుకుంటే తీసుకున్న ఉద్యోగికి, సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు మాత్రమే తెలిసేది. కానీ యాప్ ద్వారా ఏఈ, ఏడీఈ, డీఈలు కూడా తెలుసుకునే అవకాశం కలుగుతుంది. దీంతో ఎల్‌సీపై అందరి పర్యవేక్షణ కొనసాగుతుంది.

**ఎల్‌సీ యాప్ అమలు ఇలా..**

ఎల్‌సీ తీసుకోవాలనుకునే లైన్‌మెన్ యాప్ ఓపెన్ చేసి అందులో సంబంధిత ఏఈకి విన్నవించుకుంటే ఏఈ పరిశీలించి ఫీడర్‌లో ఎల్‌సీ ఇవ్వడానికి వీలు ఉందా లేదా అని పరిశీలించి అనుమతి ఇస్తారు. ఏఈ అనుమతి మేరకు లైన్‌మెన్, సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు యాప్ ద్వారా సమాచారం అందుతుంది. దీని ఆధారంగా యాప్‌లో నిర్దిష్టంగా పేర్కొన్న ఫీడర్‌లో ఎల్‌సీ ఇస్తారు. దీంతో విద్యుత్ సరఫరా నిలిపివేత, పునరుద్ధరణ పనులు బాధ్యతగా జరుగుతాయి. ఎలాంటి పొరపాట్లు జరగకుండా యాప్ తగు సూచనలు ఇస్తుంది. హెల్మెట్ ధరించాలని, హ్యాండ్ గ్లౌజ్‌లు పెట్టుకోవాలని, ఎర్త్ రాడ్ వాడాలని, ఏబీ స్విచ్ ఓపెన్ చేశారా లేదా వంటి జాగ్రత్తలు యాప్ గుర్తు చేస్తుంది. ఎక్కడైనా డబుల్ ఫీడరింగ్ ఉందా..? ఈ ఫీడర్‌కు వేరే ఫీడర్‌తో అనుసంధానం ఉందా..? వంటి సమాచారాన్ని కూడా తెలియజేస్తుంది. డబుల్ ఫీడరింగ్ ఉంటే రెండు ఫీడర్లలో ఎల్‌సీ తీసుకోవడమా..? లేదా ఇతరత్రా జాగ్రత్తలు తీసుకోవచ్చా..? అని సంయమనం చేసుకుని సిబ్బంది పనులు పూర్తి చేస్తారు. ఎల్‌సీ తీసుకున్న ఫీడర్‌లో పని కాగానే సంబంధిత లైన్‌మెన్ యాప్‌లో ఆ సమాచారాన్ని పొందుపరచి విద్యుత్ సరఫరా పునరుద్ధరించవచ్చనే సంకేతాన్ని, సమాచారాన్ని యాప్ ద్వారా చేరవేస్తారు. దీన్ని సంబంధిత సెక్షన్ ఏఈ పరిశీలించి సబ్‌స్టేషన్ ఆపరేటర్‌కు చేరవేస్తారు. దీంతో ఎల్‌సీ తీసుకున్న ఫీడర్‌లో విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తారు.

**అనవసర ఎల్‌సీలకు చెక్**



విద్యుత్ వినియోగదారులకు మరింత ఉత్తమ సేవలు అందించడంతో పాటు భద్రతా ప్రమాణాలు పెంచడానికి ఎన్‌పీడీసీఎల్ ఎల్‌సీ యాప్‌ను ప్రత్యేకంగా రూపొందించింది. యాప్‌తో ఉద్యోగుల మధ్య సమన్వయం ఉంటుంది. ఏ లైన్‌పై పనులు జరుగుతున్నాయో కూడా సులభంగా తెలుస్తోంది. మొత్తంగా అనవసర ఎల్‌సీలు తగ్గుతాయి. యాప్ ద్వారా విద్యుత్ అంతరాయాలు, మానవ తప్పిదాలు, విద్యుత్ ప్రమాదాల నివారించవచ్చు.

– గంగాధర్, ఎస్ఈ, మంచిర్యాల

# ఆదివాసీ వంటలకు డిమాండ్

- ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు
- ఉట్నూర్‌లో ఇప్పపువ్వు పండుగ కార్యక్రమం



ఇప్పపువ్వుతో తయారు చేసిన వంటకాలు రుచిచూస్తున్న ఎమ్మెల్యే బొజ్జు, అధికారులు

**ఉట్నూర్‌రూరల్:** ఆదివాసీ సాంప్రదాయ వంటలకు ఎంతో డిమాండ్ ఉందని, అనేక ఆరోగ్య ప్రయోజనాలు కూడా ఉన్నాయని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు అన్నారు. గురువారం ఉట్నూర్ కేబీ ప్రాంగణంలోని పీఎంఆర్సీ సమావేశ మందిరంలో 8వ ఇప్పపువ్వు పండుగ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్, ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా, ఉట్నూర్ సబ్ కలెక్టర్ యువరాజ్‌లు పాల్గొన్నారు. మహిళలు ఇప్పపువ్వులతో తయారు చేసిన వంటకాలు ప్రదర్శించారు. ఆదివాసీ మహిళలు ఆదివాసీ పద్ధతులు, సాంప్రదాయ వంటకాలపై అధికారులకు వివరించి తినిపించారు. అధికారులు మాట్లాడుతూ ఇప్పపువ్వు లడ్డులో ఎన్నో పోషకాలు ఉన్నాయన్నారు. ఈ లడ్డూలు ఉట్నూర్ ఎక్స్‌రోడ్డులో అందుబాటులో ఉంటాయని తెలిపారు. 12 మంది గిరిజన మహిళా సంఘం సభ్యులు ఇప్పపువ్వుల లడ్డూలు తయారుచేస్తూ ఉపాధి పొందుతున్నారని పేర్కొన్నారు. మహిళా కమిషన్ సభ్యురాలు ఈశ్వరీబాయి, దుర్గు పటేల్, సహకార మిత్ర సంస్థ మేనేజర్ విఠల్, పేసా కోఆర్డినేటర్ వసంత్‌రావు, రాయి సెంటర్ల, సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లి నుంచి వస్తూ తిరిగిరాని లోకాలకు..



జంగుబాబు (ఫైల్)

**జన్నారం:** బంధువుల పెళ్లికి వెళ్లి తిరిగి వస్తున్న ఫిజియో థెరపిస్టును రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబలించింది. ఎస్సై రాజవర్ధన్ గురువారం తెలిపిన వివరాల ప్రకారం గుడిహత్నూర్‌కు చెందిన ఉరిమెత జంగుబాబు (30) జన్నారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో ఫిజియో థెరపిస్టుగా పని చేస్తున్నాడు. గురువారం బంధువుల పెళ్లికి కలమడుగుకు వెళ్లాడు. సాయంత్రం తిరిగి వస్తున్న క్రమంలో కొమ్ముగూడెం వద్ద ఎదురుగా వస్తున్న స్కూటీని ఢీకొట్టి ఎగిరిపడ్డాడు. జంగుబాబు అక్కడికక్కడే మృతి చెందగా స్కూటీపై ఉన్న ఇందన్‌పల్లి గ్రామానికి చెందిన వంశీ తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా ఎస్సై అక్కడకు చేరుకుని వంశీని జన్నారం ఆసుపత్రికి తరలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం లక్షెట్టిపేటకు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

# రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి




నాగుల ఉమా (ఫైల్)

**వాంకిడి:** బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రోడ్డు ప్రమాదానికి గురై ఒక మహిళ మృతి చెందిన ఘటన బుధవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై ప్రశాంత్, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బంబార గ్రామానికి చెందిన నాగుల విలాస్, నాగుల ఉమా (48) దంపతులు బుధవారం కాగజ్‌నగర్ మండలం నవేగాంలోని బంధువుల ఇంటికి ద్విచక్రవాహనంపై వెళ్లారు. తిరిగి ఇంటికి వచ్చే క్రమంలో సాయంత్రం జాతీయ రహదారిపై బంబార గ్రామ సమీపంలోని యూటర్న్ వద్ద వెనుక నుంచి వచ్చిన ఓ ద్విచక్ర వాహనం వీరి వాహనాన్ని వేగంగా ఢీకొట్టింది. దీంతో వెనకాల కూర్చుని ఉన్న ఉమా రోడ్డు డివైడర్‌పై పడగా తలకు, చేతికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో మహారాష్ట్రలోని చంద్రపూర్‌కు తరలించారు. చికిత్స పొందుతూ రాత్రి 11 గంటల ప్రాంతంలో ఆమె మృతి చెందింది. ఈ ప్రమాదంలో నాగుల విలాస్‌కు గాయాలయ్యాయి. ఆయన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# పురుగుల మందు తాగిన వ్యక్తి..

**భైంసారూరల్:** మండలంలోని మిర్జాపూర్ గ్రామానికి చెందిన కదం ప్రకాశ్(41) చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై శంకర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కదం ప్రకాశ్ కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. గత కొంతకాలంగా మద్యానికి బానిసవ్వడంతో పాటు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నాడు. బుధవారం ఇంట్లో పురుగుల మందు సేవించాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిజామాబాద్ ఆసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. కుటుంబసభ్యుల ఫి ర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఆత్మహత్యకు యత్నించిన యువతి..



స్వప్న మృతదేహం

**ఖానాపూర్:** ప్రేమించిన యువకుడితో పెళ్లికి తల్లిదండ్రులు అంగీకరించకపోవడంతో యువతి ఆత్మహత్యాయత్నం చేయగా చికిత్స పొందుతూ బుధవారం అర్ధరాత్రి మృతి చెందింది. ప్రొబేషనరీ ఎస్సై శ్రావణి తెలిపిన వివరాల ప్రకారం.. ఖానాపూర్ మండలం కొలాంగూడ గ్రామానికి చెందిన ఆత్రం స్వప్న(18) గ్రామానికి చెందిన ఒక యువకుడిని ప్రేమించింది. దీనికి యువతి తల్లిదండ్రులు ఒప్పుకోకుండా కొన్ని రోజులు వేచి ఉండాలని తెలిపారు. మనస్తాపానికి గురైన స్వప్న గుర్తు తెలియని పురుగుల మందు తాగింది. వెంటనే కుటుంబ సభ్యులు ఖానాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి అక్కడి నుంచి నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతిచెందిందని ఎస్సై తెలిపారు. మృతురాలి తండ్రి దేవురావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై పేర్కొన్నారు.

### ఊపిరాడక 20 మేకలు మృతి



మృతిచెందిన మేకలు

**ఆదిలాబాద్‌టౌన్(జైనథ్):** భోరజ్ మండలం సిర్సన్న గ్రామంలో గురువారం 20 మేకలు ఊపిరాడక మృతిచెందాయి. గ్రామంలోని ఆత్రం యాదవ్, గెడాం వికాస్‌లు తమ మేకలను మేపడానికి గ్రామంలోని వైకుంఠధామం ప్రాంతానికి తీసుకెళ్లారు. మధ్యాహ్నం తిరిగి ఇంటికి తీసుకెళ్లాల్సి ఉండగా, వాటిని వైకుంఠధామంలోని స్నానాల గదిలో ఉంచి తలుపులు వేశారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో వెళ్లి చూసేసరికి ఊపిరాడక 20 మేకలు మృతిచెందాయి. రేకులు ఉండటం, తలుపులు వేసి ఉండడంతో ఎండ తీవ్ర త తట్టుకోలేక, ఊపిరాడక మృతిచెందాయని తెలుస్తోంది. వీటి విలువ దాదాపు రూ.2లక్షల వరకు ఉంటుందని, ప్రభుత్వం నష్టపరి హారం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

### జొన్న పంట దగ్ధం

**ఆదిలాబాద్‌టౌన్(జైనథ్):** సాత్నాల మండలంలోని మేడిగూడకు చెందిన క్లాం రాంరెడ్డి అనే రైతుకు చెందిన రెండెకరాల జొన్న పంట దగ్ధమైంది. గురువారం చేనుకు ఆనుకొని ఉన్న పక్క చేను రైతు గట్లపై ఉన్న చెత్తను తొలగించేందుకు నిప్పు పెట్టడంతో ప్రమాదవశాత్తు జొన్న పంటకు నిప్పంటుకుంది. దీంతో పంట పూర్తిగా కాలిబూడిదైంది. పంట చేనులో ఉన్న 50 పైపులు కూడా మంటలో కాలిపోయినట్లు రైతు వాపోయాడు. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని బాధిత రైతు కోరుతున్నాడు.ఉన్నాయి. పోలీసులకు సమాచారం ఇవ్వగా సీఐ అజయ్, ఎస్సై కృష్ణసాగర్‌రెడ్డి, క్లూస్‌టీం, డాగ్‌స్క్వాడ్‌తో గదిని పరిశీ లించారు. తులం బంగారం, 11 తులాల వెండి ఎ త్తుకెళ్లినట్లు, బాధితుల ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు. కాగా ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సీఐ, ఎస్సైలు సూచించారు.

### విద్యుత్‌షాక్‌కు గురైన వ్యక్తి మృతి

**నర్సాపూర్(జి):** డొంగుర్గాం గ్రామంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై చికిత్స పొందుతున్న వ్యక్తి గురువారం మృతిచెందాడు. ఎస్సై సాయికిరణ్ తెలిపిన వివరాల ప్రకారం.. ధనే విజయ్(51) ఈనెల 11న జంగిపల్లి చిన్నయ్య వ్యవసాయ క్షేత్రంలోని ట్రాన్స్‌ఫార్మర్ దగ్గర మోటార్ పైపులను చెక్ చేస్తుండగా ప్రమాదవశాత్తు ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. వెంటనే కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నిర్మల్ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు బుధవారం డిశ్చార్జి చేయగా డొంగుర్గాం గ్రామానికి తీసుకురాగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. విజయ్ తమ్ముడు వినయ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# ఘనంగా సామూహిక వివాహ వేడుకలు

- ఏకమైన నాలుగు జంటలు



సామూహిక వివాహాలు నిర్వహిస్తున్న ఆదివాసీ పెద్దలు

**ఇంద్రవెల్లి:** మండలంలోని అంజీ గ్రామపంచాయతీ పరిధి మామిడిగూడలో గురువారం ఆంధ్ సమాజ్ ఆధ్వర్యంలో పరమహంస సద్గురు పూలాజీబాబా సంస్థాన్ వద్ద సామూహిక వివాహ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వివాహ వేడుకల్లో అదే గ్రామానికి చెందిన నాలుగు జంటలు ఏకమయ్యాయి. రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, పట్నాపూర్ శ్రీ సద్గురు పరమహంస పూలాజీబాబా ధ్యాన్ మందిర్ వ్యవస్థాపకుడు కేశవ్ ఇంగ్లేతో పాటు ఆయా గ్రామాల ప్రజలు, బంధువులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఐటీడీఏ పీవీటీసీ ఏపీవో మెస్రం మనోహర్, ఆదివాసీ పెద్దలు డాకురే రాందాస్, కరాడే మారుతి, మెస్రం శేఖర్‌బాబు తదితరులు ఉన్నారు.

# ‘తార’ సేవలు భేష్

- ఎస్పీ అఖిల్ మహాజన్
- ఘనంగా పోలీసు జాగిలం అంత్యక్రియలు



జాగిలం తారకు నివాళులర్పిస్తున్న అఖిల్ మహాజన్

**ఆదిలాబాద్‌టౌన్:** పోలీసు శాఖకు జాగిలం తార అందించిన సేవలు మరువలేనివని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. 2013 బ్యాచ్‌లో పోలీసు వ్యవస్థలోకి వచ్చిన తార జిల్లాలో పేలుడు పదార్థాలను కనుగొనడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. పోలీసు జాగిలం తార మృతిచెందడంతో గురువారం పోలీసు కార్యాలయంలో అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా ఎస్పీ పాల్గొని తారకు శాలువా, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ వీఐపీలు జిల్లాపర్యటనకు వచ్చిన సందర్భంగా భద్రత విషయంలో తనిఖీలు నిర్వహించడంలో తార సేవలు ఎంతగానో దోహద పడ్డాయని గుర్తు చేశారు. పోలీసు జాగిలాలకు సకల సదుపాయాలు కల్పించాలని, ఎండ తీవ్రత దృష్ట్యా ప్రతీ జాగిలానికి కూలర్ ఏర్పాటు చేయాలని సూచించారు. రిజర్వు ఇన్‌స్పెక్టర్ వెంకటి, మురళి, డాగ్‌స్క్వాడ్ సిబ్బంది రమేశ్, తిరుమలేశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఏసుక్రీస్తు పునరుత్థాన జాతర

- సీఎస్ఐ చర్చి ఆవరణలో మహోత్సవం
- పెద్ద ఎత్తున తరలిరానున్న క్రైస్తవులు
- ప్రత్యేక ప్రార్థనలకు ఏర్పాట్లు పూర్తి



సీఎస్ఐ చర్చి

**లక్సెట్టిపేట:** ఏసుక్రీస్తు పునరుత్థాన మహోత్సవ ప్రాంతీయ జాతరను సీఎస్ఐ చర్చి ఆవరణలో ఈ నెల 25, 26న నిర్వహించనున్నారు. ఈ జాతరకు సుదూర ప్రాంతాల నుంచి క్రైస్తవులు పెద్దఎత్తున తరలిరానున్నారు. ఈ నేపథ్యంలో ప్రత్యేక ప్రార్థనలకు అన్ని ఏర్పాట్లు చేశారు.

**1920లో నిర్మాణం..**

ఏటా ఏప్రిల్ 25, 26వ తేదీల్లో సీఎస్ఐ చర్చిలో ఈ జాతర నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. రాష్ట్రంలో మెదక్ తర్వాత రెండో పెద్దచర్చిగా పేరొందిన లక్సెట్టిపేట సీఎస్ఐ చర్చి జిల్లాలోని చారిత్రక కట్టడాలకు సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. లక్సెట్టిపేట పట్టణ సమీపంలో సుమారు 100 ఎకరాలకు పైగా పచ్చటి పొలాలు, టేకు చెట్ల వనంలో మిషన్ కాంపౌండ్ ప్రాంతంలోని ఆహ్లాదకరమైన వాతావరణంలో సీఎస్ఐ చర్చిని ఆంగ్లేయులు నిర్మించారు. 1920లో ఇక్కడికి వచ్చిన ఇంగ్లాండ్ దేశస్తుడు రెవ సీజీ అర్లి దొర నిర్మాణం ప్రారంభించాడు. ఇంగ్లాండ్ నుంచి రంగురంగుల అద్దాలు, దగ్గరలోని గూడెం గుట్ట, గువ్వల గుట్ట, చిన్నయ్య గుట్టల నుంచి రాళ్లు తెప్పించాడు. సమీప బొట్లకుంటలోని నీటిని నిర్మాణానికి ఉపయోగించారు. మహారాష్ట్ర శిల్పకళాకారులు ఆకర్షణీయంగా నిర్మాణాన్ని తీర్చిదిద్దారు. నిర్మాణం పనులు సాగుతుండగా వేసవి కాలంలో వడదెబ్బ తగిలి అనారోగ్యానికి గురై అర్లి దొర తిరిగి ఇంగ్లాండ్ వెళ్లిపోయాడు. ఆ తర్వాత 1935లో రెవ హెచ్ బర్డ్ చర్చి నిర్మాణాన్ని పరిశీలించి పూర్తి చేయించాడు. అనంతరం ఇక్కడకు మిషనరీగా వచ్చిన రెవ ఫాస్నూట్ చర్చిని సీఎస్ఐ చర్చిగా నామకరణం చేసి ప్రారంభించాడు.

**ఘనంగా ఏర్పాట్లు..**

జాతర ఏర్పాట్లను సీఎస్ఐ చర్చి కమిటీ సభ్యులు ఫాదర్ డేవిడ్‌పాల్ పర్యవేక్షిస్తున్నారు. 25న ఉదయం గ్రామాల్లో పర్యటిస్తూ సాయంత్రం ఊత్కూరు చౌరస్తా నుంచి భాజాభజంత్రీలతో పెద్ద ఎత్తున క్రైస్తవులు ర్యాలీగా చర్చి వద్దకు చేరుకుంటారు. 7 గంటలకు సిలువ వెలిగించి ప్రత్యేక ప్రార్థనలు చేసి కీర్తనలు పాడుతారు. 26న ఉదయం నుంచి చర్చిలో ప్రత్యేక కీర్తనలు పాడుతూ పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. అనంతరం సిలువ గుట్టపైకి వెళ్లి కొవ్వొత్తులు వెలిగిస్తారు.

# ఫోన్‌కాల్ రచ్చ ప్రాణం తీసింది..!

- భవనంపై నుంచి దూకి విద్యార్థిని ఆత్మహత్య
- సోదరుడికి ఫోన్ చేయడమే శాపమైందా..?
- విద్యార్థి సంఘాలు, కుటుంబ సభ్యుల ఆందోళన
- అదనపు కలెక్టర్, పోలీసుల జోక్యంతో విరమణ



కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ మోతిలాల్



లక్ష్మిప్రసన్న(ఫైల్)


**మంచిర్యాలక్రైం:** ఫోన్ కాల్ విషయమై జరిగిన రచ్చ ఓ విద్యార్థిని ఆత్మహత్య చేసుకునేలా చేసింది. ఈ సంఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో గురువారం చోటు చేసుకుంది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భీమిని మండలం జగ్గయ్యపేటకు చెందిన జంగంపల్లి గోపాల్, నాగమ్మ దంపతుల రెండో కూతురు లక్ష్మిప్రసన్న మంచిర్యాలలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతోంది. గురువారం ఉదయం హాస్టల్ భవనం నాలుగో అంతస్తు నుంచి దూకింది. కళాశాల విద్యార్థులు, సిబ్బంది ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మధ్యాహ్నం చనిపోయింది. మంచిర్యాల ఏసీపీ ప్రకాష్, సీఐ ప్రమోద్‌రావు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. విద్యార్థిని ఆత్మహత్యకు కళాశాల సిబ్బంది, నైట్‌వాచ్‌మెన్ మహేశ్ వేధింపులే కారణమంటూ ఆస్పత్రి ఎదుట కుటుంబ సభ్యులు, విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగారు. అదనపు కలెక్టర్ మోతీలాల్ ఆస్పత్రికి చేరుకోగా.. విద్యార్థిని తండ్రి గోపాల్ ఆయన కాళ్లపై పడి న్యాయం చేయాలంటూ వేడుకున్నాడు. లక్ష్మిప్రసన్న మృతికి కారణమైన యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, కుటుంబానికి న్యాయం చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు, కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు. రూ. 20లక్షలు పరి హా రం, కుటుంబంలో ఒకరికి ప్ర భుత్వ ఉద్యోగం ఇవ్వాలని అ న్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్‌గౌడ్, నా యకులు పాల్గొన్నారు. మృతురాలి కుటుంబ సభ్యులతో మా ట్లాడిన అదనపు కలెక్టర్.. న్యాయం చేస్తామని హామీనివ్వడంతో ఆందోళన విరమించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ వెల్లడించారు.

**అసలేం జరిగింది..**

ఈ నెల 23న రాత్రి 9.30గంటలకు లక్ష్మిప్రసన్న తన చిన్నమ్మ కొడుకు వెంకటేష్‌కు వాచ్‌మెన్ మహేశ్ సెల్‌ఫోన్ నుంచి ఫోన్ చేసింది. తర్వాత 9.45గంటలకు వెంకటేష్ వాచ్‌మెన్‌కు ఫోన్ చేసి ఇంత రాత్రి ఫోన్ ఎందుకు ఇచ్చావంటూ బెదిరించడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. ఇది కాస్త ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ మేనేజర్ మల్లేష్‌కు ఫోన్ ద్వారా వెంకటేష్ ఫిర్యాదు చేయడం, మహేశ్‌పై మల్లేష్ ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఉద్యోగంలో నుంచి తొలగిస్తానని బెదిరించడం, ఈ విషయాన్ని కళాశాల ప్రిన్సిపాల్ అనూష దృష్టికి తీసుకెళ్లడం వరకు వెళ్లాయి. అయితే ఈ ఘటనపై కళాశాల యాజమాన్యం, వాచ్‌మెన్ మహేశ్ లక్ష్మిప్రసన్నపై ఒత్తిడి చేసి వేధించారని, భరించలేకనే ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు, విద్యార్థిని చిన్నమ్మ కొడుకు వెంకటేష్ ఆరోపించారు.

# నిర్మల్‌లోనే నాణ్యమైన విద్య

- ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి



టాపర్స్‌గా నిలిచిన విద్యార్థులతో ఆల్ఫోర్స్ అధినేత డాక్టర్ వి.నరేందర్ రెడ్డి

**నిర్మల్‌టౌన్:** హైదరాబాద్ విద్యాసంస్థలకు దీటుగా నిర్మల్‌లోనే ఆల్ఫోర్స్ విద్యాసంస్థ నాణ్యమైన విద్య అందిస్తుందని విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి అన్నారు. ఇంటర్మీడియట్‌లో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్లుగా నిలిచిన విద్యార్థులకు గురువారం జిల్లా కేంద్రంలోని ఆల్ఫోర్స్ బాలికల జూనియర్ కళాశాలలో అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆల్ఫోర్స్‌లో విద్యతో పాటు విలువలను అందిస్తామన్నారు.

**టాపర్స్ వీరే..**

ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీసీ బాలికల విభాగంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్స్‌గా సర్వాడే కృష్ణవేణి 468/470, జోషి ప్రసూన శ్రీ 468/470, పడిగెల కీర్తిశ్రీ కి 468/470, బాలుర విభాగంలో బోనాల శ్రీ చరణ్ 467/470, వడకపూర్ అఖిల్ 467/470, కార్తికేయన్ 467/470 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో సామ ఫిర్దోస్ 438/440, జోహా మహావీష్ 438/440, నబిలా తహరీమ్ 438/440 మార్కులు సాధించారు. సెకండ్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసీ విభాగాలలో కవల్ ప్రీత్‌కౌర్ 995/100, సుమయ కణం 994/100, జాదవ్ నవ్యశ్రీ 993/1000 మార్కులు సాధించి ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా టాపర్లుగా నిలిచారు. కళాశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ఒకరిపై పోక్సో కేసు నమోదు

**దహెగాం:** మండలంలోని పెసరికుంట గ్రా మానికి చెందిన కామెర హోక్టుపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై కందూరి రాజు గురువారం తెలిపారు. ఈ నెల 22న సాయంత్రం అదే గ్రామానికి చెందిన 11ఏళ్ల బాలిక తల్లిదండ్రులు చేను పనికి వెళ్లగా ఇంటి వద్ద చెల్లిని ఆడిస్తుంది. ఈ సమయంలో హోక్టు బాలికతో అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.